క్లుప్తంగా

విద్యార్థులకు జ్ఞాపికలు



మెమెంటోలతో విద్యార్థులు

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక హైస్కూల్‌లో పది పరీక్షల్లో ఉత్తమ జీపీఏ సాధించి నవిద్యార్థులను శనివారం చంద్రయ్యసార్ విద్యావైద్యవికాస సమితి అధ్యక్షుడు చెన్నమాధవుని రామరాజు ఆధ్వర్యంలో జ్ఞాపికలు, డిక్షనరీలు అందించి సన్మానించారు. హెచ్‌ఎం రంగనాథశర్మ, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

బీసీ విద్యార్థి సంఘంలో చేరిక



విద్యార్థులకు కండువా కప్పుతున్న రవిగౌడ్

సిరిసిల్లఅర్బన్: బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో శనివారం పలువురు విద్యార్థులు బీసీ విద్యార్థి సంఘంలో చేరారు. ఈ సందర్భంగా కంచర్ల రవి విద్యార్థులకు కండువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. విద్యావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేసి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. పట్టణ అధ్యక్షుడు రుద్రవీణ సుజిత్, చింటు, రాహుల్, సిద్దార్థ, వినయ్, తదితరులు ఉన్నారు.

జీపీ భవనానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ ప్రమీల

కోనరావుపేట: మండలంలోని జైసేవాలాల్ భుక్యారెడ్డి తండా(వట్టిమల్ల) జీపీ భవనానికి సర్పంచ్ లకావత్ ప్రమీల భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటైన రెడ్డి తండాలో జీపీ భవనం లేకపోవడంతో అంగన్‌వాడీ భవనంలో కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇప్పుడు రూ. 20లక్షల నిధులు మంజూరుకావడంతో గిరిజన దినోత్సవం సందర్భంగా జీపీ భవనానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలువురిపై ఆవు దాడి

రుద్రంగి: మండలకేంద్రంలో శుక్రవారం ఆవు దాడిచేయగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీ లక్ష్మినరసింహ స్వామి ఆలయానికి విరాళంగా అందించే ఆవులు గ్రామంలో తిరుగుతుంటాయి. అందులో ఒక ఆవుకు మెదడు సంబంధిత వ్యాధి సోకి ఆరుగురిపై దాడిచేసింది. ఇందులో నలుగురికి స్వల్పగాయాలు కాగా బైరెడ్డి శ్రీనివాస్, దాసరి అంజవ్వ అనే ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్సనిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

నర్సరీ పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని అనంతారం గ్రామంలో హరిత నర్సరీని ఏపీఓ చంద్రయ్య శనివారం పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున మొక్కలకు ఉదయం, సాయంత్రం నీళ్లు పట్టాలని నిర్వాహకులకు సూచించారు. తెలంగాణ క్రీడాప్రాంగణ పనులుపరిశీలించారు.

రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ఎంపీపీఎస్ పాఠశాల నుంచి కేసీఆర్‌నగర్ వరకు రోడ్డునిర్మాణం చేపడుతుండగా శనివారం డీఈవో రమేశ్‌కుమార్ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఈ నేపథ్యంలో స్థలాన్ని పరిశీలించి మండెపల్లి సర్పంచ్ శివజ్యోతితో మాట్లాడి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరినట్లు తెలిపారు. అనంతరం మండెపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన డీఈవోను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ తిరుపతి, హెచ్‌ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయులు మల్లికార్జున్, శ్రీనివాస్, రజిత పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా అంతరాయం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో ఆదివారం ఉదయం 6 నుంచి 11గంటల వరకు మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈఈ దివ్య శనివారం తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

వెరైటీ స్కూల్ బ్యాగ్స్

- ప్రారంభమైన విద్యాసంస్థలు
- పలు రకాల వెరైటీల్లో స్కూల్, కళాశాల బ్యాగులు
- చిన్నారులను ఆకట్టుకుంటున్న బొమ్మల బ్యాగులు
- దుకాణాల్లో మొదలైన సందడి



వివిధ రకాల మోడళ్లలో స్కూల్, కాలేజ్ బ్యాగులు



బ్యాగులు కొనేందుకు వచ్చిన కొనుగోలుదారులు

సిరిసిల్లఅర్బన్: వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు మళ్లీ ప్రారంభమయ్యాయి. బుడి బుడి అడుగులు వేస్తూ పాఠశాలకు వెళ్లే చిన్నారుల నుంచి హైస్కూల్‌కి వెళ్లే విద్యార్థుల వరకు పుస్తకాలు, నోట్‌బుక్స్ తీసుకెళ్లేందుకు బ్యాగులు తప్పనిసరి. అయితే విద్యార్థులను ఆకర్శించే విధంగా మార్కెట్‌లో ప్రత్యేకంగా తయారు చేసిన రకరకాల మోడళ్లలో బ్యాగులు లభిస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులను ఆకట్టుకునేందుకు సూపర్‌మెన్, కార్టున్ నెట్‌వర్క్ స్పైడర్‌మెన్, బార్బీడాల్, చోటాబీం, డోరిమన్, ఐరన్‌మెన్, మిక్కిమౌస్ వంటి రకరకాల మోడళ్లతో పాటు త్రీడి చిత్రాలతో కూడిన బ్యాగులు మార్కెట్‌లో లభిస్తున్నాయి. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో స్కూల్ బ్యాగ్స్‌కి డిమాండ్ పెరిగింది. విద్యార్థుల అభిరుచులకు తగ్గట్టుగా సిరిసిల్ల పట్టణ ప్రాంతంలోని దుకాణదారుల రకరకాల మోడళ్లలో బ్యాగులను తెచ్చి విక్రయిస్తున్నారు. దీంతో స్కూల్‌బ్యాగులు కొనేందుకు సందడి నెలకొంది.

ఆకట్టుకుంటున్న వెరైటీ డిజైన్లు

చిన్నారులకు నచ్చే సరికొత్త డిజైన్లలో స్కూల్‌బ్యాగులు, క్యారెజ్ బ్యాగులు మార్కెట్‌లో లభిస్తున్నాయి. సుతి మెత్తని బట్టతో తయారుచేసిన, బొమ్మలు బ్యాగులు తీసుకునేందుకు చిన్నారులు ఇష్టపడుతున్నారు. సదురు బ్యాగులు వారికి ఆడుకునే వస్తువుల్లా కనిపిస్తుండడంతో వాటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా విద్యార్థుల పుస్తకాలు భారం అధికంగా ఉంటే వారికోసం ట్రాలీ బ్యాగులు (వీల్ బ్యాగులు) మార్కెట్‌లో లభిస్తున్నాయి. కళాశాల విద్యార్థులకు సైతం పలురకరకాల మోడళ్లలో ఆకట్టుకునే డిజన్లలో బ్యాగులు లభిస్తున్నాయి.

మన్నికను బట్టి ధరలు

రకరకాల స్కూల్ బ్యాగులు వందల మోడళ్లలో మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. బ్యాగుల పరిమాణం, మన్నికను బట్టి ధరలు ఉన్నాయి. సాధారణ బ్యాగుల ధరలు రూ.200ల నుంచి రూ.2వేల వరకు పలుకుతున్నాయి. నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు రూ.200ల నుంచి 500లకు పైగా ధరలు ఉన్నాయి. మార్కెట్‌లో పలు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన అమెరికన్ టూరిజం, రీబాక్, అడిడాస్, ఆయూష్, ప్రియారిటీ, లీవియా, తదితర కంపెనీలకు చెందిన బ్యాగులు కూడా లభిస్తున్నాయి. వీటి ధర దాదాపు రూ.1500ల నుంచి రూ.2వేల వరకు పలుకుతున్నాయి. పెద్ద పట్టణాల్లో లభించే మోడళ్లు సైతం సిరిసిల్ల పట్టణంలో లభిస్తుండడంతో పట్టణ ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే కొనుగోలు చేస్తున్నారు.

ఆకట్టుకునేలా బొమ్మల బ్యాగులు



పిల్లలకు కావాల్సిన స్కూల్ బ్యాగులు, క్యారేజ్ బ్యాగులు అందుబాటు ధరల్లో ఉన్నాయి. బొమ్మల బ్యాగులు ఆకట్టుకునే విధంగా ఉండడంతో కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. పెద్ద పట్టణాల్లో దొరికనట్లే సిరిసిల్లలో కూడా అనేక డిజైన్లలో బ్యాగులు లభిస్తున్నాయి.

–వోద్నాల వెంకటేష్,సిరిసిల్ల

అందుబాటు ధరల్లో



స్కూల్, కాలేజ్ బ్యాగులు వివిధ రకాల డిజైన్లలో మార్కెట్‌లో లభిస్తున్నాయి. నర్సరీ నుంచి మొదలుకొని కాలేజ్ విద్యార్థులను సైతం ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని కొత్తకొత్త వెరైటీల్లో సరసమైన ధరల్లో బ్యాగులు లభిస్తున్నాయి.

–సుమన్, సిరిసిల్ల. కొనుగోలుదారుడు

కొనుగోళ్లు పెరుగుతున్నాయి



పాఠశాలలు ప్రారంభంతో స్కూల్ బ్యాగుల కొనేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు దుకాణాలకు బారులు తీరుతున్నారు. వారి అభిరుచులకు తగ్గట్టుగానే అనేక రకాల మోడళ్లలో స్కూల్ బ్యాగులు ఉన్నాయి. ప్రస్తుతం కొనుగోళ్లు ఊపందుకున్నాయి.

–నాగిశెట్టి ప్రసాద్, షాప్ నిర్వాహకుడు

సీసీ కెమెరాలు ప్రారంభం



మాట్లాడుతున్న రూరల్ సీఐ ఉపేందర్

తంగళ్లపల్లి: మండలంలోని గోపాల్‌రావుపల్లెలో 'మేముసైతం' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను శనివారం రాత్రి సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్ తంగళ్లపల్లి ఎస్సై పాకాల లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్ మాట్లాడుతూ.. గ్రామంలో 4 సీసీ కేమెరాలు 24 గంటలు పనిచేస్తాయని నేరాల నియంత్రణలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మల్లేశం, పోలీస్ సిబ్బంది నరేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు

సర్పంచ్ లేకుండానే ప్రారంభిస్తారా..?

గోపాల్‌రావుపల్లె గ్రామపంచాయతీలో సీసీ కెమెరాల సెటప్ ఏర్పాటుచేయగా, ఆదివారం సర్పంచ్ అందుబాటులో లేని సమయంలో సీసీ కెమెరాలను ప్రారంభించడంపై సర్పంచ్ పద్మ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులు రాజకీయ పార్టీల మాదిరిగా ప్రవర్తించడం సరికాదని ఆరోపించారు. తాను అందుబాటులో లేనని ప్రారంభాన్ని వాయిదా వేయాలని తెలిపినా వినకుండా ప్రారంభించారన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం సంతోషమేనని కానీ గ్రామంలో ప్రథమ పౌరురాలిని పట్టించుకోకపోవడం వారివిజ్ఞతకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు.

89వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

ముస్తాబాద్: సింగిల్‌విండో పరిధిలోని ఆరు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తయినట్లు చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. సొసైటీ పరిధిలోని ఆరు కేంద్రాల్లో 89,217 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించామన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేశామన్నారు. ధాన్యం కొనుగోళ్లు విజయవంతం చేసిన రైతులు, హమాలీ, రైస్‌మిల్లర్లకు, పీఏసీఎస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



చందుర్తిలో డ్రంకెన్‌డ్రైవ్ టెస్టుపై అవగాహన



ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజేశ్



మొబైల్ థాణా దివస్‌లో సీఐ బన్సీలాల్



కోనరావుపేటలో ఎస్సై రమాకాంత్ అవగాహన

ప్రజల వద్దకే పోలీసులు

వేములవాడరూరల్/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/కోనరావుపేట/ముస్తాబాద్/ఇల్లంతకుంట/చందుర్తి/వీర్నపల్లి: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఠాణాల్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని అన్ని పోలీస్‌స్టేషన్లలో స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు, పోలీస్ ఉన్నతాధికారులు వారి విధులు, నిర్వహణ తీరుపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. పోలీసులు వినియోగిస్తున్న టెక్నాలజీ, ఆయుధాల వినియోగం, స్టేషన్ రైటర్, టెలికాన్ఫరెన్స్, ఆన్‌లైన్ ఎఫ్‌ఐఆర్, టీఎస్‌కాప్, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూం, ఆయుధాలు భద్రపర్చుగది, బాధితుల ఫిర్యాదు, బ్లూ కోల్ట్స్ పనితీరు, షీటీం నిర్వహణ, పొగొట్టుకున్న మొబైల్‌ను సీఈఐఆర్ అప్లికేషన్‌తో కనిపెట్టే విధానం, డ్రంకెన్‌డ్రైవ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎల్లారెడ్డిపేటలో సీఐ మొగిలి, వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్, కోనరావుపేటలో ఎస్సై రమాకాంత్, చందుర్తిలో ఎస్సై జిల్లెల్ల రమేశ్, ఇల్లంతకుంటలో ఎస్సై రాజేశ్, ముస్తాబాద్‌లో ఎస్సై వెంకటేశ్వర్లు, గంభీరావుపేటలో ఎస్సై మహేశ్‌కుమార్, వీర్నపల్లిలో ఎస్సై నవత పాఠశాలల విద్యార్థులకు ఆయుధాల వినియోగం, చట్టాలపై అవగాహన కల్పించారు.



ముస్తాబాద్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ఎల్లారెడ్డిపేట: ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీఐ మొగిలి



ఎఫ్ఐఆర్ నమోదుపై ఎస్సై రమేశ్ అవగాహన

ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న నాయకులు

ముస్తాబాద్: ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు ఇటీవల నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు బీజేపీ నాయకులు అక్షరాభ్యాసం చేయించారు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కనమేని చక్రాధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలలో 124 మంది విద్యార్థులుండగా, ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. ఈ మేరకు తానే స్వయంగా ఒక వలంటీర్‌ను నియమించినట్లు తెలిపారు. వలంటీర్‌కు వేతనం చెల్లిస్తానని, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు సాయం చేస్తానన్నారు. చక్రాధర్ రెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం పద్మ, బీజేపీ మండల అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, మీస శంకర్, సంజీవ్, శ్రీకాంత్, మల్లేశం, దేవయ్య, భాను, ఉపేంద్ర, తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేకే

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/తంగళ్లపల్లి: రాష్ట్రాన్ని తండ్రి, కొడుకులు వారి అనుచరులు దోచుకుంటున్నారని, దోచుకో, దాచుకో అనే నినాదంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన సాగుతోందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే.మహేందర్ రెడ్డి అన్నారు. ఎద్దేవా చేశారు. మంత్రి కేటీఆర్ అండదండలతో సిరిసిల్లలో అతని అనుచరులు సహజ సంపదను దోచుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మారుస్తున్న బీఆర్‌ఎస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల మనోభావాలకు విలువిచ్చి రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి ఎస్సీ కాలనీలో, వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో, తంగళ్లపల్లి మండలంలోని గోపాల్‌రావుపల్లెలో శనివారం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎల్లారెడ్డిపేటలో 40మంది గ్రామస్తులు, వీర్నపల్లిలో 20 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధిచెబుతారన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. రాగట్లపల్లిలో మాజీ సర్పంచ్ మందాటి రాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.

తేలని నిధుల దుర్వినియోగం

- షోకాజ్‌తోనే సరిపెట్టిన అధికారులు
- ప్రజాప్రతినిధిపై చర్యలకు వెనకడుగు

వేములవాడరూరల్: ఒక ప్రజాప్రతినిధి చేయని పనులను చేసినట్లు రికార్డులు చూపి ప్రభుత్వ నిధులు కాజేసిన ఘటనపై జిల్లా అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదుచేయగా విచారణ చేపట్టిన అధికారులు సదరు ప్రజాప్రతినిధికి నిధులు కాజేసిన విషయంపై ఏడు రోజుల్లో సమాధానమివ్వాలని షోకాజ్ నోటీసులు జారీచేశారు. దాదాపు పది రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్ సర్పంచ్ వేయని రోడ్డును వేసినట్లుగా రూ.1.65 లక్షలు బిల్లులు పెట్టి నిధులు డ్రాచేసిన విషయంపై అదే గ్రామానికి చెందిన మధుకర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ జరిపిన అధికారులు నోటీసులు జారీచేశారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అనుమానాలువ్యక్తమవుతున్నాయి.

మంచినీళ్ల పండుగను విజయవంతం చేయాలి

వేములవాడఅర్బన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించే మంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. వేములవాడ మండలం అగ్రహారం మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్స్, ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద మంచినీళ్ల పండుగ కార్యక్రమం ఆదివారం ఉదయం 9 గంటలకు చేపడుతున్నామన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో కొత్తగా ఏర్పాటుచేసి మూడు హైమాస్ట్ లైట్లను సర్పంచ్ శివజ్యోతి ఎంపీటీసీ బుస్సస్వప్న, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఉప సర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు బబిత, లత, దుబ్బాక లత, శేఖర్ బాబు, రఘు పాల్గొన్నారు.

పాప మృతికి కారకులను శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రఘుపతి

సిరిసిల్లటౌన్: పసికందు మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వేములవాడ మండల ం రుద్రవరం గ్రామానికి చెందిన రఘుపతి కోరారు. శనివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదిరోజుల క్రితం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తన భార్య వీణ ను ప్రసవం కోసం తీసుకెళ్లగా పాప పుట్టిందన్నారు. వైద్యులు పాప ఆరోగ్యంగా ఉందని చెప్పారని, రెండుగంటల తర్వాత పాపను వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని పంపించినట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి పాపను తీసుకెళ్లగా అప్పటికే మృతిచెంది నట్లు వైద్యులు తెలిపారన్నారు. ఈవిషయమై వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫి ర్యాదు చేయగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీ సుకోలేదన్నారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి స్పందించి మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. బాధితుడికి ధర్మ సమాజ్ పార్టీ అ ధ్యక్షుడు భీమ్ కీర్తన, ప్రధాన కార్యదర్శి ఉల్లెందుల అరుణ్, ఉపాధ్యక్షుడు ఎడవెల్లి బాబు సంఘీభావం తెలిపారు.

బెదిరింపులకు పాల్పడ్డ ఇద్దరి బైండోవర్

వేములవాడ: వేములవాడలో మాజీ నక్సలైట్లమంటూ చెప్పుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్న స్థానిక సాయినగర్‌కు చెందిన జంగిడి బాబు, వేములవాడరూరల్ మండలం నూకలమర్రికి చెందిన బొడ్డు నారాయణలను శనివారం తహసీల్దారు ముందు బైండోవర్ చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. సదరు వ్యక్తులు ఎవరినైనా బెదిరింపులకు గురిచేస్తే 8712656412లో తెలపాలని డీఎస్పీ కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం తరలింపు నిలిపివేత

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం తరలింపును అధికారులు నిలిపివేశారు. కిషన్ దాస్‌పేట, కిష్టంపల్లి రెండు ఆమ్లేట్ గ్రామాలకు ఈ అంగన్‌వాడీ కేంద్రం అనుకూలంగా ఉంది. దీనిని ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనంలోకి సూపర్‌వైజర్ సరిత, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న పాఠశాలలోకి మార్చేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు లక్ష్మీరాజంకు ఫిర్యాదు చేయడంతో కేంద్రం తరలింపు నిలిచిపోయింది. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం కోసం కిలో మీటర్ దూరంలో ఉండే కేంద్రానికి వెళ్లడం కష్టమని తెలపడంతో అధికారులు తరలింపును నిలిపివేశారు. ఉపసర్పంచ్ రజిత హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న ప్రవాస భారతీయులు

రుద్రంగి(వేములవాడ): ఇటీవల మస్కట్‌లో మండలకేంద్రానికి చెందిన కూర్మ మల్లేశం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబానికి మస్కట్ సేవా సమితి రుద్రంగి సభ్యులు, ప్రవాస భారతీయులు ఆర్థికసాయం అందజేశారు. మస్కట్ సేవా సమితి రుద్రంగి సభ్యులు రూ.30వేలు సేకరించి బాధిత కుటుంబానికి శనివారం ఆర్థికసాయాన్ని అందజేశారు. దాతలు ముందుకువచ్చి ఆర్థికసాయం అందించాలని వారు కోరారు. ఇక్కడ ప్రవాస భారతీయులు, మస్కట్ సేవా సమితి సభ్యులు, తదితరులున్నారు.